ఈనాడు మహబూబాబాద్

గురువారం సెప్టెంబరు 26, 2024

మానుకోట గ్రామీణ ఠాణాకు పురస్కారం



మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: ప్రజలకు సత్వర సేవలు అందించడంలో మహబూబాబాద్ గ్రామీణ ఠాణాకు రాష్ట్రస్థాయిలో గౌరవం దక్కింది. బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి చేతుల మీదుగా ఠాణా ఎస్సై వి.దీపికారెడ్డి అవార్డును అందుకున్నారు. ప్రజలకు సత్వర సేవలు అందించడంలో రాష్ట్ర వ్యాప్తంగా పది ఠాణాలను ఎంపిక చేయగా వాటిలో మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తొమ్మిదో స్థానం లభించింది. రూరల్ పోలీసు స్టేషన్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

జాతీయ లోక్ అదాలత్ వినియోగించుకోవాలి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కోర్టులో ఈనెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాజీపడ దగిన కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసుల జాబితాను తయారు చేసి ఇరువర్గాల వారికి అవగాహన కల్పించాలని కోర్టు లైజనింగ్ అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులకు ఎస్పీ సూచించారు.

వర్షాల వేళ.. ఒడిసిపడదాం!

ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వ ఉత్తర్వులు





దాహం వేసినప్పుడే ఆలోచిద్దామా..?

ఇప్పుడు వర్షాలు పడుతున్నాయి.. నీరంతా వృథాగా సముద్రం పాలవుతోంది.. కాంక్రీట్ వనంలో చుక్క నీరు కూడా ఇంకడం లేదు.. మళ్లీ వేసవి వచ్చేవరకు తాగునీటికి కటకటే.. అప్పుడు ఇంకుడు గుంతలు గుర్తుకొస్తాయి.. దాహం వేసినప్పుడే.. బావి తవ్వితే ప్రయోజనం ఉంటుందా..? మరేం చేద్దాం..!

ఇదే తరుణం...

తాజాగా వాన నీటిని ఒడిసిపట్టి.. భూగర్భ జలాల పెంపునకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ నడుం బిగించింది. అన్ని పురపాలికలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంత ఉండాలని ఉత్తర్వులు వెలువరించింది.. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగంతో పాటు ఇటు పౌరులూ కదలాలి.

పౌరుల మేలుకొలుపు కోసం..!

నగర పాలక సంస్థతో పాటు పురపాలికల్లో పౌరుల మేలుకొలుపు కోసమన్నట్లు ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారు. జల శక్తి అభియాన్ పథకం కింద 'క్యాచ్ ది రెయిన్' పిలుపుతో ఈ కార్యాచరణ అమలు చేశారు. డోర్నకల్‌లో మున్సిపల్ పాలకవర్గం, ఉద్యోగులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

బాధలన్నీ గట్టెక్కాయి..

ఈ దంపతుల పేర్లు ధారియా-రామిని... మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చాప్లాతండా వాసులు. వీరింట్లో బోరు నుంచి అంతంతమాత్రంగానే నీరు వచ్చేది. ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టాక ఇంటి అవసరాలకు సరిపడా నీరొస్తోంది.. ఇంట్లో వాడిన నీళ్లు నేరుగా ఇంకుడు గుంతలోకి వెళ్తుండటంతో దోమలు, విష పురుగుల బాధ తప్పింది.

న్యూస్‌టుడే-డోర్నకల్, కార్పొరేషన్, జనగామ

భవనాల నిర్మాణాలకు అనుమతిచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా తప్పని చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు విధివిధానాలను పొందుపర్చింది. ఇప్పటికే ఉన్న భవనాల్లోనూ నిర్మించాలి. విద్యా సంస్థలు ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, అపార్టుమెంట్లు, ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ తప్పనిసరి. బడా భవనాలకు ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెటు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించారో లేదో అధికారులు పరిశీలించాలి.

డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారే లేరు..

భవన నిర్మాణ అనుమతి రుసుములో ఇంకుడు గుంతల డిపాజిట్ చెల్లించి, నిర్మాణం పూర్తయిన పిదప, ఇంకుడు గుంతల డిపాజిట్ రుసుమును వెనక్కి తీసుకోవచ్చు. కానీ, పురపాలికల్లో ఇంకుడు గుంతలు నిర్మించి, రుసుము వెనక్కి తీసుకున్న దాఖలాలు తక్కువే..

మూలుగుతున్న రూ.5 కోట్లు

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం గ్రేటర్ వరంగల్ డబ్బులు వసూలు చేసింది. బిల్డింగ్ పర్మిషన్ ఫీజుతో పాటు వాటర్ హార్వెస్టింగ్ ఛార్జీలు తీసుకున్నారు. నివాస గృహాల నుంచి రూ.5 వేలు, అపార్టుమెంట్లు, వ్యాపార, వాణిజ్య భవనాల నుంచి రూ.10వేల పైనే వసూలు చేశారు. 2003 నుంచి నిధులను ప్రత్యేక ఖాతాలో జమ చేశారు. ఇలా రూ.5 కోట్ల నిధులు మూలుగుతున్నాయి. 2013, 2018లో స్పెషల్ డ్రైవ్ ద్వారా కొంతమంది యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించినా అసంపూర్తిగా వదిలేశారు.

కానరాని చైతన్యం

పట్టణ ప్రజల్లో చైతన్యం కానరావడం లేదు.. భవన నిర్మాణం జరిగిన చోటల్లా ఇంటి ఆవరణ లేదా పరిసరాల్లో ఇంకుడు గుంత నిర్మాణమనేది నామ మాత్రంగా కనిపిస్తోంది.. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో మూడు నెలల క్రితం అధికారులు ఇంటింటా సర్వే చేశారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 300 చదరపు మీటర్లు దాటిన గృహాలు 11,588 ఉన్నాయి. ఇందులో 6,973 ఇళ్లు సర్వే చేయగా.. కేవలం 789 ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించగా 768 వాడకంలో ఉండగా, 21 నిరుపయోగంగా ఉన్నాయి. 6184 ఇళ్లలో లేవని తేలింది.

ఇలా నిర్మిద్దాం

ఇంట్లో వాలు స్థలం ఎంపిక చేసుకోవాలి. అనువైన పొడవు, వెడల్పుతో 2 మీటర్ల లోతు గుంత తవ్వాలి. అడుగు భాగాన సగభాగం 40 మి.మీ కంకర, తర్వాత పావు భాగం 20 మి.మీ కంకర నింపాలి. గుంత కొంత భాగం ఖాళీగా ఉండేలా చూసుకొని దొడ్డు ఇసుకతో నింపాలి. తర్వాత వర్షపు నీటి పైపును ఇంకుడు గుంతలోకి మళ్లించాలి. ఇళ్లలో ఖాళీగా ఉన్న బోర్లను కూడా ఇంకుడు గుంతలా చేసి నీటిని మళ్లించవచ్చు.



ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ

పట్టణాల్లో ఆవాసాలు	3,51,768
అపార్టుమెంట్లు	687
ఇంకుడు గుంతలు	2146

రైస్ మిల్లుపై పౌరసరఫరాలశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు



మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సాయి శ్రీనివాస ఇండస్ట్రీస్ రా పారా బాయిల్డ్ రైస్ రైస్‌మిల్‌లో బుధవారం సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రికార్డుల ప్రకారం ఈ రైస్‌మిల్‌కు 88.96 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ ఇచ్చారని.. 20 వేల క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉందని టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ప్రభాకర్ తెలిపారు. రైస్ మిల్లుకు సంబంధించిన మరికొంత ధాన్యం వెంకటేశ్వర బిన్నీ రైస్ మిల్, శ్రీసాయి కాటన్ మిల్లులో నిల్వ ఉంచినట్లు యాజమానులు చెప్పడం వల్ల అక్కడ కూడా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా తనిఖీ చేసి తర్వాత చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మూడు రైస్‌మిల్లులపై దాడులు నిర్వహించి ధాన్యం పక్కదారి పట్టించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ మూడు మిల్లుల్లో సుమారు రూ. 24.55 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు తెలుస్తుందన్నారు. అధికారులు కృష్ణవేణి, ప్రేమ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.



దోమ నివారణకు ముందస్తు చర్యలు షురూ!

మిరప పంటను నల్లితామర, దోమ బారి నుంచి కాపాడుకునేందుకు ఓ రైతు మొదట్లోనే తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి శివారు ఓ రైతు మిరప సాగులో నల్లి తామర, దోమల నివారణకు రంగు రంగుల జిగురు అట్టాలను ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రోగులకు అత్యవసర వైద్య సేవలను అందించేందుకు పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వైద్యులను ఆదేశించారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. డయాలసిస్ సెంటర్, మెడికల్ వార్డు, గైనిక్ వార్డు, ఇతర విభాగాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, ఆర్ఎంవో జగదీశ్వర్ తదితరులున్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మరికొన్ని అండర్ పాస్‌లు నిర్మించాలి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్-కేసముద్రం రైల్వే మార్గం మధ్యలో అండర్ పాస్‌లను నిర్మించాలని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం భరతేశ్‌కు మార్‌జైన్‌ను కలిసి విన్నవించారు. ప్రధానంగా ఈ రైలు మార్గంలో సర్వాపురం-అన్నారం గ్రామాల మధ్య అండర్ పాస్‌లు లేక ఆ ప్రాంతాల్లోని రైతులు, పశువుల కాపరులు రైలు పట్టాలు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ నాయకులు రమేశ్‌చందర్‌రెడ్డి ఉన్నారు.



సికింద్రాబాద్ రైల్వే నిలయంలో డీఆర్ఎంకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

బయ్యారంలో అఖిలపక్ష నేతల అరెస్టు

● వివాదాస్పద స్థలంలో నిర్మాణాల కూల్చివేతకు యత్నం

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం బస్టాండ్ కూడలిలోని చౌదరి మైనింగ్ కంపెనీ (సీఎంసీ) స్థల వివాదం మండలకేంద్రంలో బుధవారం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆ స్థలం ముమ్మాటికి గ్రామానికి చెందినదే అంటూ బయ్యారం అఖిలపక్ష పార్టీల నేతలు, గ్రామస్థులు కొంతకాలంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. వివాదాస్పదంగా మారిన ఆ స్థలంలో కొందరు ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ఈక్రమంలో బుధవారం తెల్లవారుజామున అఖిలపక్ష పార్టీల నేతలు, గ్రామస్థులు నిర్మాణాలను కూల్చేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు జోక్యం చేసుకొని అఖిలపక్ష నాయకులను ఎక్కడికక్కడే అరెస్టు చేసి జిల్లాలోని వివిధ ఠాణాలకు తరలించారు. ఎస్పీ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావు బయ్యారం చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. వివిధ ఠాణాల సీఐలు, ఎస్సైలు, భారీ పోలీసు బలగాలతో బయ్యారంలో మోహరించారు. ఎస్పీ బయ్యారం పోలీస్‌స్టేషన్ నుంచి పరిస్థితిని పర్యవేక్షిస్తూ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. మరోవైపు అఖిలపక్షనాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వివిధ పార్టీల ఆధ్వర్యంలో బయ్యారం, గంధంపల్లి బస్టాండ్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపజేశారు. కొందరు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. బయ్యారం, జీకేపేట బస్టాండ్ కూడళ్లలో పోలీసు బలగాలు నిత్యం పహారా కాశారు. అఖిలపక్షపార్టీల నాయకులు మొత్తం 14 మందితోపాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని వివిధ ఠాణాలకు తరలించారు.



సేవాలాల్‌సేనా జిల్లానాయకుడు రవిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



బయ్యారం బస్టాండ్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న ఎన్డీ నాయకులు

ఒకే ఒక్కరు!



తిరుమలాపురం పాఠశాలలో..

కురవి మండలం తిరుమలాపురం ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులున్నారు. ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. 1 నుంచి 5 తరగతులకు అన్ని సబ్జెక్టులను ఆయనే చెప్పాల్సిన పరిస్థితి. ఆయన సెలవు పెట్టాలంటే ఇబ్బందే. మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కురవి

బదిలీ ధ్రువపత్రాలు అడుగుతున్నారు..!



మల్యాల యూపీఎస్‌లో

మహబూబాబాద్ మండలం మల్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 35 ఉండగా రోజుకు 15 మంది హాజరవుతున్నారు. నలుగురు ఉపాధ్యాయులున్నారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ పిల్లలను వేరే పాఠశాలలో చేర్పించేందుకు బదిలీ ధ్రువపత్రాలు ఇవ్వాలని 6,7 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మహబూబాబాద్ రూరల్

గురువుల సర్దుబాట..!

మానుకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియపై తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిస్తూ ఈ నెల 20న ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖ పచ్చజెండా ఊపడంతో ఇప్పటికే రెండు నెలలుగా జిల్లాలో పని సర్దుబాటు ప్రక్రియపై దృష్టి సారించారు. ఆ మేరకు సన్నాహాలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ నిర్దేశిత విధానాల ప్రకారం ఈ అంశాన్ని పూర్తి స్థాయిలో చేపట్టింది. దీనిని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో జిల్లాలో పాఠశాలల పరిస్థితి.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉన్నారా.. తదితర విషయాలపై బుధవారం 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన జరిపింది.

ప్రభుత్వ విధానాల ప్రకారం..

☛ ప్రాథమిక/ప్రాథమికోన్నత (I-5 తరగతులు) కనీస టీచర్ల సంఖ్య

● విద్యార్థులు	● ఉపాధ్యాయులు
1–10	01
11–60	02
61–90	03
91–120	04
121–150	05
151–200	06

200 విద్యార్థుల సంఖ్య దాటిన తర్వాత ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడ్ని నియమించాలి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో ప్రస్తుతం వివిధ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు 3,077 మంది పనిచేస్తున్నారు. జిల్లాలో ఇంకా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత అలాగే ఉంది. వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న 381 ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం డీఎస్సీ-2024 పరీక్షల నిర్వహణ ప్రక్రియ ఇటీవల ముగిసింది. ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల బోధనపై పోస్టుల కొరత ప్రభావం పడే అవకాశం ఏర్పడింది. దీంతో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ అనివార్యమైంది. ఈమేరకు ఉపాధ్యాయ సంఘాల బాధ్యులతో మండలాల వారీగా సమావేశాలను నిర్వహించి వివరాలు సేకరించారు. ఇటీవల జారీ అయిన ఉత్తర్వుల మేరకు సవరణలతో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

సంఘాలు కోరేదేమిటంటే..: హేతుబద్ధీకరణ జీవో 25ను 2021లో జారీచేశారు. అశాస్త్రీయంగా ఉందని ఉపాధ్యాయ సంఘాల ప్రాతినిధ్యం మేరకు అప్పట్లో నిలిపివేశారు. మళ్లీ ఆ ఉత్తర్వుల మేరకే సర్దుబాటు ఆదేశాలు ఇచ్చారు. అందువల్ల ఉత్తర్వులను ఉపసంహరించాలని లేని పక్షంలో సవరించాలి.



గాజులగట్టు పాఠశాల

ఇక్కడ విద్యార్థులు తక్కువే

గూడూరు మండలం గాజులగట్టు ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం 13 మంది విద్యార్థులే ఉన్నారు. నలుగురు ఉపాధ్యాయులుండగా ఒకరు డిప్యూటేషన్‌పై వెళ్లారు. 1నుంచి 5వ తరగతుల్లో తప్ప 6,7 తరగతుల్లో విద్యార్థులే లేరు. – న్యూస్‌టుడే, గూడూరు

☛ ప్రభుత్వ మార్గదర్శకాల, ఆదేశాల మేరకు పని సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లాలోని మండల విద్యాశాఖాధికారుల నుంచి ఇప్పటికే సమాచారం తెప్పించామన్నారు. నియమ నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

నేడు క్రీడోత్సవాలు

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ఏటీడీఓ పరిధిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు గురువారం మహబూబాబాద్ మండలంలోని రెడ్యాల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు డీడీ సైదానాయక్, ఆర్గనైజేషన్ కార్యదర్శి డి. మోహన్‌నాయక్ బుధవారం తెలిపారు.

సుందరీకరణ పనులకు ప్రతిపాదనలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కంబాలచెరువు ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు పనులను వెంటనే ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. సమీపంలోని నూకల రామచంద్రారెడ్డి విగ్రహం ప్రాంతాన్ని సందర్శించి ఆ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, ఆర్ఐ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించిన యశ్వంత్



జాతీయ పతాకంతో యశ్వంత్

మరిపెడ, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ ఇటీవల అరుణాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ గోరీచెన్ పర్వతాన్ని అధిరోహించి మరో ఘనత సాధించారు. అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ పట్టుదల, కృషి, ఆసక్తితో ప్రపంచంలోని శిఖరాలను అధిరోహిస్తున్నారు. సెప్టెంబర్ 4న ప్రారంభించిన యాత్ర 6488 మీటర్ల ఎత్తైన శిఖరాన్ని 18 రోజుల్లో అధిరోహించి కిందకు దిగినట్లు యశ్వంత్ పేర్కొన్నారు. ఎవరెస్ట్ అధిరోహించాలనే సంకల్పంతో ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సాహస అభిమానులు యశ్వంత్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు.

లక్ష్యం వైపు దూసుకెళ్తున్నారు!

ప్రతిభ గల పేద క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతంగా రాణిస్తారనడానికి ఉదాహరణ ఇది.. సరైన నైపుణ్య శిక్షణ అందిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనడానికి తార్కాణమిది.. 'ఈనాడు' సంస్థ తీసుకొచ్చిన 'లక్ష్య' కార్యక్రమం మారుమూల క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకొస్తోంది.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన జీవాంజీ దీప్తి 'లక్ష్య' ప్రోత్సాహంతో పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా కాంస్య పతకం కొల్లగొట్టింది. ఆమె స్ఫూర్తిగా హనుమకొండ కేంద్రంగా శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలతో దుమ్ములేపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలతో అదరగొట్టారు. ఈ నేపథ్యంలో వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

–న్యూస్‌టుడే, వరంగల్ క్రీడావిభాగం


మహ్మద్ కైఫ్

చిరుత వేగంతో..

హుజూరాబాద్‌కు చెందిన స్ప్రింటర్ మహ్మద్ కైఫ్ పరుగులో చిరుత వేగంతో పోటీపడతారు. చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి ఉండటంతో అథ్లెటిక్స్ ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలతో ప్రతిభ కనబరిచారు. నాలుగు జాతీయ, ఆరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న కైఫ్ స్ప్రింట్స్‌లో రికార్డు టైమింగ్ సృష్టిస్తానని చెబుతున్నారు.


సబ్బావత్ దత్తు

భారత జట్టులో చోటు కోసం..

నల్గొండకు చెందిన దత్తు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు. లాంగ్‌జంప్, హెప్టాథ్లాన్‌లో తనదైన ప్రదర్శనతో పతకాలు సాధిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకున్నారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన దత్తుకు 'లక్ష్య' కేంద్రం అండగా ఉంటూ ఉచితంగా నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఇప్పటివరకు ఐదు జాతీయ స్థాయి, 14 రాష్ట్రా స్థాయి టోర్నీల్లో పాల్గొన్నారు. భారత అథ్లెటిక్స్ బృందంలో చోటు సంపాదిస్తానని అంటున్నారు.


రవితేజ

రెండు విభాగాల్లో..

మంచిర్యాలకు చెందిన రవితేజ 3000 మీటర్ల(ఫ్లాట్ రన్), 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో అత్యంత ప్రతిభతో రాణించాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు కొల్లగొట్టాడు. జాతీయ స్థాయిలో నాలుగు, రాష్ట్ర స్థాయిలో 9 టోర్నీల్లో పాల్గొన్నాడు. అండర్-20 3000 మీటర్ల స్టిపుల్ చేస్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలని లక్ష్యంగా సాధన కొనసాగిస్తున్నారు. హనుమకొండలోని కాకతీయ డిగ్రీ కళాశాలలో రెండో ఏడాది చదువుతున్నారు.


గణేష్

రికార్డు టైమింగ్ నమోదు

హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో గణేష్ రికార్డు టైమింగ్ నమోదు చేశారు. 100 మీటర్ల పరుగును 10.83 సెకండ్లలో పూర్తి చేశారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ టైమింగ్‌గా కోచ్ నాగరాజు తెలిపారు. నల్గొండకు చెందిన రవితేజ హనుమకొండలోని కేడీసీలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నారు. రెండేళ్ల క్రితమే రవితేజ 'లక్ష్య'లో చేరారు. నైపుణ్య శిక్షణ అందడంతో పరుగుకు మరింత పదును పెంచారు. మెరుగైన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయిలోను రికార్డు టైమింగ్ నమోదు చేస్తానని తెలిపారు.

హనుమకొండ జేఎన్ స్టేడియం కేంద్రం

2019లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం కేంద్రంగా ఈనాడు 'లక్ష్య' అథ్లెటిక్స్ శిక్షణ శిబిరం ప్రారంభమైంది. వరంగల్‌కు చెందిన భారత అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్ సూచనతో జాతీయ స్థాయి అథ్లెట్ నాగరాజును కోచ్‌గా ఎంపిక చేశారు. కొద్ది మందితో ప్రారంభమైన శిక్షణ అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటే వరకు చేరారు. ప్రస్తుతం 18 బాలురు, ఒక బాలిక తర్ఫీదు పొందుతున్నారు. వారిలో 15 మంది జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. దత్తు, గణేష్ జాతీయ స్థాయిలో ఏకంగా పతకాలు కొల్లగొట్టారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పది పతకాలు

దక్షిణ భారత పోటీలకు..

ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో వరంగల్ లక్ష్య అథ్లెట్లు ఏకంగా పది పతకాలు సొంతం చేసుకున్నారు. దత్తు, కైఫ్, గణేష్, శ్రీధర్, రాఘవ, రవితేజ, తరుణ్‌కుమార్ తమ విభాగాల్లో అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించారు. కైఫ్, గణేష్, శ్రీధర్, రవితేజ, దత్తులు గుంటూరులో అక్టోబర్ 19, 20న జరిగే దక్షిణ భారత అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో దత్తు, కైఫ్, రవితేజ రెండేసి పతకాలతో సత్తాచాటారు.


హనుమకొండ జేఎన్ స్టేడియంలో శిక్షణలో ఉన్న అథ్లెట్లతో లక్ష్య మెంటర్ నాగపురి రమేష్ (పాత చిత్రం)

ఆర్మీ ఉద్యోగాలకు ఎంపిక

లక్ష్య శిక్షణ శిబిరానికి చెందిన అథ్లెట్లు 2022, 2023 సంవత్సరాల్లో ఆర్మీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిలో నిరోష్, ఆదిత్య కృష్ణ, రోహిత్, శ్రీను, ప్రవీణ్, అభినవ్, రఘునాథ్, సింగ్, నగేష్ శ్రావణ్‌లు ఉన్నారు. ప్రస్తుతం దేశంలోని వివిధ సైనిక శిబిరాల్లో శిక్షణలో ఉన్నారు.


జనగామ కలెక్టరేట్‌లో ప్రారంభించి భోజనం చేస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్ రిజ్వాన్‌బాషా, తదితరులు

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో జనగామ జిల్లా సచివాలయంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను పాలనాధికారి రిజ్వాన్ బాషాతో కలిసి వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం ప్రారంభించి, నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి భోజనం చేశారు. కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మంచి నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని నిర్వాహకులకు ఎంపీ సూచించారు. అనంతరం బిల్లు చెల్లిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రవీందర్, పీఆర్‌టీయూ నాయకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల సాధన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జడ్పీ సమావేశ మందిరంలో సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘం కృషితోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు జరిగాయని చెప్పారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ మాట్లాడుతూ.. టీచర్ల సమస్యలు, పాత బకాయిల చెల్లింపులపై సీఎంను కలుస్తామని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబ్దుల్ గఫార్, అసోసియేట్ అధ్యక్షులుగా కె.రఘు, ఎ.మహేందర్, ఉపాధ్యక్షులుగా పి.మల్లయ్య, సి.సుధాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పి.అర్పితలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, మాజీ ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్, ప్రతిక సంపాదకులు ఇన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, మండల బాధ్యులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు


(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	125
రిటైల్:	147
డ్రెస్డ్:	213
స్కిన్‌లెస్:	243

శిక్షణ ఎస్సైలకు ఠాణాల కేటాయింపు

వరంగల్‌క్రైం : పోలీసు శాఖలో ఎంపికై శిక్షణకు కమిషనరేట్‌కు వచ్చిన ఎస్సైలకు ఠాణాలు కేటాయించారు. రెండు ఠాణాల్లో 15 రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలి. వివిధ అంశాలపై సీనియర్ అధికారులు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 25 నుంచి అక్టోబర్ 9 వరకు, అక్టోబర్ 10 నుంచి 24 వరకు రెండు విడతల్లో శిక్షణ పొందుతారు.

ములుగు జిల్లా కలెక్టర్ పేరిట నకిలీ ఖాతా



ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పేరుతో సైబర్ నేరగాళ్లు నకిలీ ఫేస్‌బుక్ ఖాతా తెరిచి పలువురికి మెసేజ్‌లు పంపిస్తూ డబ్బులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ అప్రమత్తమై మోసపూరిత మెసేజ్‌లను నమ్మొద్దని, వెంటనే దానిని తొలగించాలని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ పేరులో సమావేశంలో ఉన్నానని అత్యవసరంగా డబ్బులు కావాలని 998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి పలువురికి ఈ సందేశం పంపించి సైబర్ నేరగాడు డబ్బులు ఫోన్ పే చేసి స్క్రీన్ షాట్ షేర్ చేయాలని కోరాడు. దీంతో కలెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఫేస్‌బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వొద్దని సూచించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ చాటేందుకు.. యువజనోత్సవం

స్వామి వివేకానందుడి జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల ఆధ్వర్యంలో ఏటా యువజనోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా యువత ప్రతిభ చాటేందుకు అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర సంచాలకుడు, యువజన సర్వీసుల శాఖల ఆదేశాల మేరకు పాలనాధికారి అధ్యక్షతన జిల్లా యువజన, క్రీడల ఆధ్వర్యంలో ఈ నెల 28న యువజనోత్సవాలను నిర్వహించనున్నారు. జానపద నృత్యాలు, జానపద గేయాలు విభాగంలో వ్యక్తిగత, బృంద పోటీలు ఉంటాయి. కవిత్వం, వ్యాసరచన, పోస్టర్ రూపకల్పన, వక్తృత్వ పోటీలు ఉంటాయి. సైన్స్ మేళాను యువజనోత్సవాల్లో మొదటిసారి ప్రవేశపెట్టారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ పోటీలు ప్రవేశపెట్టారు. యువత సొంతంగా తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించవచ్చు. యువకృతి విభాగంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన హస్తకళలను అర్థం చేసుకోడానికి యువజన క్రీడల శాఖ అవకాశం కల్పిస్తోంది. దీని కోసం హస్త కళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు, తదితర అంశాలపై గరిష్ఠంగా ఇద్దరు వ్యక్తులు ముఖాముఖిలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. యువజనోత్సవాలను యువతీ యువకులకు మూడు దశల్లో పోటీలు నిర్వహిస్తారు. మొదటి దశ జిల్లా స్థాయిలో ఈ నెల 28న, రెండో దశ హైదరాబాద్‌లో, మూడో దశ జనవరి 12-16 వరకు కర్ణాటకలో జాతీయ స్థాయి పోటీలు ఉంటాయి. 15 నుంచి 29 ఏళ్ల మధ్యనున్న యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా యువజన, క్రీడల అధికారి తుల రవి కోరారు.

–న్యూస్‌టుడే, ములుగు టౌన్


జానపద నృత్యం చేస్తున్న బృందం (పాత చిత్రం)

యువజన సంబరం

నైపుణ్య ప్రదర్శనకు.. కళా ఉత్సవ్

విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా వివిధ దశల్లో ప్రతిభ చాటేందుకు ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తంగా 'కళా ఉత్సవ్' పేరుతో పలు రకాల పోటీలు నిర్వహిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పోటీల నిర్వహణకు విద్యాశాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తొమ్మిది, పదో తరగతి, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థులు ఏదైనా కళను ప్రదర్శించవచ్చు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలి. మండల, జిల్లా స్థాయి పోటీలు జిల్లా విద్యాధికారుల సూచనల మేరకు ఈ నెలాఖరు నాటికి నిర్వహిస్తారు. అక్టోబరులో రాష్ట్ర స్థాయి, నవంబరులో జాతీయ స్థాయిలో పోటీలు జరగనున్నాయి. జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కళాకారులకు నగదు బహుమతులు, పథకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయక కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు ఉంటాయి. ఉప అంశాలైన జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందుస్థానీ, కర్ణాటక, జానపదం, చిత్రలేఖనం, శిల్పకళ, కథలు చెప్పడం, నాటకంలో కళాకారులు తమ ప్రతిభ చూపవచ్చు. 'వివిధ కళల్లో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు 'కళా ఉత్సవ్' ఓ మంచి వేదిక.. జిల్లా విద్యాధికారి సూచనల మేరకు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలని అకాడమిక్ క్వాలిటీ సమన్వయకర్త కె.లక్ష్మణ్ చెప్పారు.


నృత్యం చేస్తున్న విద్యార్థిని(పాతచిత్రం)

– న్యూస్‌టుడే, భూపాలపల్లి, మానుకోట

పనులు వేగిరం.. దక్కిన ఫలితం

ఎన్‌హెచ్‌సీ పోటీల్లో ఓరుగల్లు సత్తా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చారిత్రక ఓరుగల్లు మహా నగరానికి జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. మూడేళ్లుగా నిర్వహిస్తున్న నైబర్ హుడ్ ఛాలెంజ్(ఎన్‌హెచ్‌సీ) పోటీల్లో గ్రేటర్ వరంగల్ సత్తా చాటింది. బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చితో పాటు వరంగల్ నగరానికి నైబర్ హుడ్ ఛాలెంజ్ పోటీల్లో 'ఎక్సలెన్స్ సర్టిఫికెట్' దక్కింది. బుధవారం దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్మార్ట్‌సిటీ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఏఈ కార్తీక్‌రెడ్డి ఎక్సలెన్స్ ధ్రువపత్రం అందుకున్నారు.


దిల్లీలో స్మార్ట్‌సిటీ ఎండీ రాహుల్ కపూర్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న గ్రేటర్ వరంగల్ ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, చిత్రంలో ఏఈ కార్తీక్‌రెడ్డి

ఎందుకు వచ్చిందంటే..!

దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 స్మార్ట్‌సిటీ నగరాలకు మూడేళ్ల క్రితం మొదటి దశలో నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరుతో నిధులు కేటాయించారు. స్మార్ట్‌సిటీ మిషన్ జారీ చేసిన నిర్ణీత సమయంలో అధికారులు వరంగల్ దేశాయిపేట ఎంహెచ్‌నగర్‌లో 56 గంటల్లో చిట్టి పార్కు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా క్రిస్టియన్ కాలనీ, కరీమాబాద్ గుండుబావి, హనుమకొండ శ్రీనగర్ కాలనీలో పార్కులు సిద్ధం చేశారు. హనుమకొండ అంబేడ్కర్ కూడలిలో బుద్ధ ప్లాజాను నిర్ణీత సమయంలో పూర్తి చేశారు. ఈ వివరాలన్నీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు పంపించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు దక్కింది.

వరంగల్‌కు గర్వకారణం

- గుండు సుధారాణి, మేయర్

'నైబర్ హుడ్ ఛాలెంజ్' పోటీల్లో వరంగల్ నగరానికి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ దక్కడం గర్వంగా ఉంది. ఈ స్ఫూర్తితో నగర సుందరీకరణ కొనసాగిస్తాం. రెండో దశ పోటీ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నిధులు ఇవ్వనుంది. వాటితో మరిన్ని పార్కులు అభివృద్ధి చేస్తాం.


పార్కు ముఖ ద్వారం పరిస్థితి ఇది


నిలిచిన వర్షం నీరు

సరిగమ.. నిర్వహణ మమ!

ఫోకస్


కూలిన స్తంభాలు

ఒకప్పుడు ఆ పార్కులోకి వెళ్తే సప్త స్వరాలు వింటున్న అనుభూతి కలిగేది. . శిల్ప సౌందర్యం, పచ్చని పరిసరాలు ఆహ్లాదంగా కనిపించేవి.. నేడు మాత్రం విరిగిన ముఖద్వారం తాలూకు శిల్పాలు, అక్కడక్కడా అందమైన శిల్పాలకు పెట్టిన లైట్లు దొంగలపాలయ్యాయి. నిర్వహణ లేక ఆ పార్కు ఇలా కనిపిస్తోంది. లక్షలు వెచ్చించి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని సరిగమ పార్కు దుస్థితి ఇది. – ఈనాడు, హనుమకొండ


దొంగల పాలైన శిల్పాల ముందు లైట్లు

రాష్ట్రస్థాయి జూడో పోటీలు షురూ!

వరంగల్ క్రీడావిభాగం : రాష్ట్రస్థాయి జూడో పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన క్రీడాకారులు హాజరయ్యారు. ఎస్‌జీఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి దస్రునాయక్ మాట్లాడుతూ.. సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించినట్లు వివరించారు. ఈ నెల 27 వరకు పోటీలు జరుగుతాయన్నారు. వివిధ జిల్లాల కోచ్‌లు, ప్రభుత్వ పీఈటీలు పాల్గొన్నారు.

మండలాలకు ఇన్‌ఛార్జి ఎంఈఓలు

మానుకోట, న్యూస్‌టుడే: మండలాల్లో సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకే ఆయా మండలాల విద్యాశాఖాధికారులుగా (ఎంఈఓ) పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) అప్పజెప్పుతూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం జిల్లాలో 18 మండలాల్లోని వివిధ జడ్పీ ఉన్నత పాఠశాలల సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులే మండల నోడల్ అధికారులుగా (ఎంఎన్‌ఓ) పని చేస్తున్నారు. ఇక వీరే ఇక ఎంఈఓలుగా వ్యవహరించనున్నారు.

విద్యా పథకాల సక్రమ నిర్వహణ కోసం..

మండల విద్యావ్యవస్థలో ఎంఈఓలు నిర్వహించే పాత్ర కీలకమైనది. ప్రధానంగా పాఠశాలల పర్యవేక్షణ, విద్యా పథకాల అమలులో వారి పాత్ర ముఖ్యమైనది. అయితే వివిధ కారణాల వల్ల ఎంఈఓ పోస్టుల భర్తీ ఏళ్ల తరబడి భర్తీ కావడం లేదు. ఫలితంగా కొద్ది మంది ఎంఈఓలతోనే మండల స్థాయి విద్యా కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

ముగ్గురితోనే..

జిల్లాలో 18 మండలాలు ఉండగా ముగ్గురు రెగ్యులర్ ఎంఈఓలే ఉన్నారు. వీరు కూడా ఆ మధ్య జరిగిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లారు. అయినప్పటికీ ఇక్కడ ఎంఈఓలుగా విధిలేని పరిస్థితుల్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఒక్కో ఎంఈఓకు ఐదు నుంచి ఏడు మండలాల బాధ్యతలు ఉండడం వారికి భారంగా మారింది. మండల స్థాయిలో విద్యావ్యవస్థ పూర్తిస్థాయి పర్యవేక్షణ అగమ్యగోచరంగా తయారైంది. ఇలాంటి పరిస్థితుల్లో మండలాల్లో సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి ఎంఎన్‌ఓలుగా బాధ్యతలు అప్పజెప్పారు. ప్రస్తుతం ఎంఎన్‌ఓలుగా పనిచేస్తున్న వారికి విద్యావిషయ సంబంధమైన పరిమిత విధులే ఉన్నాయి. ఈ స్థితిలో వారికి ఎఫ్‌ఏసీ ఎంఈఓలుగా బాధ్యతలు అప్పజెప్పడం వల్ల ప్రాథమిక విద్య, మధ్యాహ్నం భోజన పథకం, వాటి బిల్లుల చెల్లింపు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, ఉపాధ్యాయులకు వార్షిక ఇంక్రిమెంట్ల మంజూరు, దీర్ఘకాల సెలవుల మంజూరు, ప్రైవేటు ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల పర్యవేక్షణ, ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే విద్యా కార్యక్రమాల అమలును పాఠశాల, మండల స్థాయిలో సమర్థంగా పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు అవకాశం ఏర్పడింది.



ఇనుగుర్తి: మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జె.రూపారాణి

ఆసుపత్రి భవనానికి మోక్షమెప్పుడో..?

కురవి, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పూర్తైనా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పాత భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడుతోంది. కురవి మండలం బలపాల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వర్షం పడితే చాలు నీరు గారుతూ పరికరాలు తడుస్తున్నాయి. దానిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. సకాలంలో పనులు పూర్తి అయ్యాయి. జిల్లా కలెక్టర్ సైతం పరిశీలించి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఏడాది దాటుతున్నా కనీసం దానిని పట్టించుకున్న వారే కరవయ్యారు. ఇప్పటికైనా అధికారులు నూతన భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



అలంకార ప్రాయంగా మారిన నూతన భవనం

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

దంతాలపల్లి, న్యూస్‌టుడే: రేపోని శివారు జాలుబావుల గ్రామంలో విద్యుత్తు నియంత్రిక, స్తంభాన్ని పిచ్చి మొక్క తీగలు అల్లుకుపోయాయి. - వెంకటయ్య, స్థానికుడు

తీగలను తొలగించి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూస్తాం. **- మహేష్, విద్యుత్తు సిబ్బంది**

పైప్‌లైన్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లో పైపులైను లీకేజీకి సిబ్బంది బుధవారం మరమ్మతులు చేశారు. దీంతో ప్రజలకు కుళాయిల ద్వారా శుద్ధ జలం సరఫరా అయింది.

ఎస్పీని కలిసిన శిక్షణ ఎస్సైలు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: రాష్ట్ర పోలీస్ అకాడమీలో తొమ్మిది నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు బుధవారం ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌ను ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రజల్లో పోలీసు శాఖకు మరింత గౌరవం పెంపొందించేలా పనిచేయాలని కోరారు.

వర్షానికి తడిసిన మొక్కజొన్న

కేసముద్రం, న్యూస్‌టుడే: వానాకాలం సాగు చేసిన మొక్కజొన్న పంటను ప్రస్తుతం చేను నుంచి తీసి ఆరబోస్తున్నారు. మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసుకున్న మక్కలు తడిసిపోయాయి. మొక్కజొన్న తడిసిపోకుండా కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు.

దంతాలపల్లిలో ఎల్‌ఈడీ వెలుగులు!

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లిలో ఎల్‌ఈడీ వెలుగులు ప్రసరించనున్నాయి. గ్రామంలోని పలు కాలనీల్లో వీధి లైట్లు లేక అంధకారం నెలకొనడంతో ఎమ్మెల్యే రామచంద్రునాయక్ సీడీఎఫ్ నిధుల ద్వారా వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. మండల కేంద్రానికి ఆరు ఎల్‌ఈడీ లైట్లను మంజూరు చేశారన్నారు. వీటిని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క స్తంభానికి రూ.75 వేల చొప్పున మొత్తం ఆరు లైట్లకు రూ.4.50 లక్షలతో [illegible] ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, దుబ్బగూడెం, పాత బ్యాంక్, జంగాల కాలనీల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.



దంతాలపల్లిలో పాత బ్యాంకు వద్ద స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

బోధనపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

గూడూరు, న్యూస్‌టుడే: బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జడ్పీ సీఈవో నర్మద అన్నారు. మండంలోని బొద్దుగొండ, బ్రాహ్మణపల్లి, గూడూరు అంగన్‌వాడీ కేంద్రాలు, కస్తూర్బా విద్యాలయం, గూడూరు ప్రాథమిక పాఠశాల, ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలను బుధవారం ఆమె పరిశీలించారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో కస్తూర్బా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. ఎంపీడీవో వీరస్వామి, ఎంఈవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉన్నారు.



బ్రాహ్మణపల్లి కేజీబీవీ పాఠశాలలో తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో నర్మద

కొనసాగిన ఉపాధ్యాయుల నిరసన

మానుకోట, నెల్లికుదురు, కొత్తగూడ, దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 25 ఉత్తర్వులను సవరించాలని కోరుతూ ఉపాధ్యాయులు చేస్తున్న నిరసన జిల్లాలో బుధవారం కొనసాగింది. పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో తమ నిరసన వ్యక్తం చేశారు. టీపీటీఎఫ్, పీఆర్టీయూ టీఎస్, డీటీఎఫ్ తదితర సంఘాల నేతలు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దంతాలపల్లి ఉన్నత పాఠశాలలో



నెల్లికుదురులో...



పాగుల్లపల్లి పాఠశాలలో ..



జిల్లా కేంద్రంలో

తొర్రూరు నియోజకవర్గం

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఆధునికత

తొర్రూరు, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటరీకరణ రోజురోజుకు విస్తరిస్తోందని, విద్యార్థులు చదువుతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చెర్లపాలెం ఉన్నత పాఠశాలల్లో బ్రైట్ ఫైల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌లను బుధవారం ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ల్యాబ్‌లు ఏర్పాటు చేసిన బ్రైట్ ఫైల్డ్ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రామచంద్రయ్య, ఉపఛైర్మన్ సురేందర్‌రెడ్డితోపాటు ఫౌండేషన్ ప్రతినిధులు కృష్ణ, ఫణికుమార్, సింహాద్రి, అమూల్యరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగు నీటి బోర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాలనాధికారి అద్వైత్‌కుమార్‌సింగ్‌తో కలిసి సమీక్షించారు.



చెర్లపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

పెద్దవంగర, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఇన్‌ఛార్జి ఎంఈవోగా పదోన్నతి పొందడాన్ని హర్షిస్తున్నామని పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పాఠశాలలో శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, యాకన్న, శ్రీధర్, నరేందర్‌రెడ్డి, అంజయ్య, వేణుమాధవ్ పాల్గొన్నారు.

భాజపాకు పెరుగుతున్న ప్రజల మద్దతు



కార్యకర్తకు సభ్యత్వాన్ని అందజేస్తున్న రామ్మోహన్‌రెడ్డి

తొర్రూరు, న్యూస్‌టుడే: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు హర్షిస్తున్నారని, దీంతో రాష్ట్రంలో భాజపాకు రోజురోజుకు ప్రజల మద్దతు పెరుగుతోందని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. డివిజన్ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం భాజపా పూర్వ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా నివాళులర్పించారు. పార్టీ నాయకులు కుమార్, సురేష్, రాజేష్, నవీన్, రాజ్‌కుమార్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

తొర్రూరు, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్, ఐకాస ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ కార్యక్రమంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్వినిరెడ్డికి టీఎస్‌యూటీఎఫ్ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ మాట్లాడుతూ.. గురుకులాల్లో అశాస్త్రీయ పనివేళలను సవరించాలని, వార్డెన్లను ప్రత్యేకంగా నియమించాలని, మెస్ ఛార్జీలు పెంచాలని, ప్రత్యేకంగా కేటాయించాలని కోరారు. సంఘం ప్రతినిధులు నాగయ్య, వెంకన్న, చైతన్య, రవి, శేఖర్, జనార్దన్, యాకయ్య, రాజేష్ పాల్గొన్నారు.

'నూతన చట్టాలు కార్మికులకు శాపం'

తొర్రూరు, న్యూస్‌టుడే: పార్లమెంట్‌లో ఎలాంటి చర్చలేకుండా 2021లో కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికుల పాలిట శాపంగా మారాయని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్య కార్మికసంఘాల పిలుపుమేరకు డివిజన్ కేంద్రంలోని గాంధీ కూడలిలో బుధవారం లేబర్‌కోడ్స్ ప్రతులను దహనం చేసి, ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంఘాల బాధ్యులు ప్రసాదు, వెంకన్న, మల్లేష్, రాములు, రామస్వామి, రమేష్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి చేటు'

తొర్రూరు, న్యూస్‌టుడే: జమిలి ఎన్నికల విధానం దేశప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటిదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్లం అశోక్ తెలిపారు. మండలంలోని గుర్తూరులో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా పార్టీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని, ఏ విధంగా ప్రయోజనకరమో చెప్పాలన్నారు. పార్టీ నాయకులు యాకూబ్, మధుబాబు, యాకయ్య, సాయిమల్లు, శంకరాచారి, కుమారస్వామి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆదివాసీ చట్టాలకు రక్షణ కల్పించాలి

గూడూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ హక్కుల చట్టాలకు రక్షణ కల్పించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య అన్నారు. గూడూరులో బుధవారం ముఖ్య నాయకులతో సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దేవేందర్, మల్లేష్, నరేష్, వీరస్వామి, ఉపేందర్, వెంకన్న తదితరులున్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

గార్ల, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎఫ్‌ఏసీ ఎంఈవో మంకిడి వీరభద్రరావు తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆయనను సత్కరించారు. అనంతరం ఆయన ఎంపీడీవో మంగమ్మను మర్యాద పూర్వకంగా కలిశారు. మంకిడి వీరభద్రరావు గార్లలో 1999 నుంచి 2000 సంవత్సరందాకా వీఆర్‌వోగా విధులను నిర్వహించారు.

ఏకగ్రీవ ఎన్నిక

డోర్నకల్‌ఐ డోర్నకల్‌లో పీఆర్టీయూటీఎస్ మండల కార్యవర్గ ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా డి.ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రమేష్, అసోసియేట్ అధ్యక్షులుగా వి.శ్రీనివాసరావు, సంజీవరావు, ఉపాధ్యక్షులుగా సురేష్, జె.శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా శేషదీపిక, కార్యదర్శులుగా డి.ప్రదీప్, రామరాజు, మహిళా కార్యదర్శులుగా ఉష, శ్రీలత ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణని సంఘం జిల్లా అధ్యక్షుడు సంకబద్రినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పర్యవేక్షించారు.

ఉపకేంద్రం నుంచి వారంలో విద్యుత్తు సేవలు

గార్ల: సత్యనారాయణపురం విద్యుత్తు ఉపకేంద్రం పునఃప్రారంభ పనులను ఎట్టకేలకు బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, సీఎండీ వరుణ్‌రెడ్డి ఐఏఎస్ చొరవతో ఉపకేంద్రం పనులకు శ్రీకారం చుట్టారు. వారం రోజుల్లో సేవలను ప్రారంభించనున్నట్లు ఏఈ మహేంద్రబాబు తెలిపారు.

ఇంటి నిర్మాణం వివాదాస్పదం

కేసముద్రం: మండలంలోని భూక్యారాంతండా పంచాయతీ పరిధిలోని కాలనీతండాలో ఓ గిరిజన యువకుడు నిర్మిస్తున్న ఇంటి నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. కాలనీతండా సమీపంలోని సర్వే నెంబరు 399/1లోని ప్రభుత్వ భూమిలో ఇల్లు లేని నిరుపేదలకు ఆగస్టు 2023న భారాస ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేసింది. అదే భూమిలో గతంలో కాంగ్రెస్ నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించింది. పట్టాల పంపిణీ రెండు వర్గాల మధ్య వివాదాస్పదంగా మారింది. ఇంటి నిర్మాణం చేపడుతుండగా బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు.

తండ్రికీ అన్ని తానై..

నర్సింహులపేట: నర్సింహులపేట గ్రామానికి చెందిన నాయిని కాంతం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు. కుమారులు లేకపోవడంతో చిన్న కుమార్తె చౌడ సమత తలకొరివి పెట్టి తండ్రి రుణం తీర్చుకున్నారు.

కొత్తగూడ: బత్తులపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందిన రైతు దుర్గం లక్ష్మయ్య మృతి చెందగా అతడికి కుమారులు లేకపోవడంతో పెద్ద కూతురు వెంకటమ్మ తండ్రికి తలకొరివి పెట్టారు.

రక్తదానం.. ప్రాణదానం

కేసముద్రం: రక్త దానాన్ని మించిన దానం లేదని రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ పీవీ ప్రసాద్, రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రావుల రవిచందర్‌రెడ్డి అన్నారు. కేసముద్రం ఆర్యవైశ్య భవనంలో బుధవారం సహాయ ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 60మంది యువత రక్త దానం చేశారు. ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థ బాధ్యులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..

కేసముద్రం: ఇంటికన్నె గ్రామానికి చెందిన రైల్వే ఉద్యోగి కాడబోయిన విజయ్ ఇటీవల మరణించగా అతడి స్నేహితులు బుధవారం కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేలు ఆర్థిక సహాయం అందజేశారు. విజయ్ మిత్రులు లాలు, వెంకన్న, బాలాజీనాయక్, శ్రీధర్, అనిల్, కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నాయకులను వెంటనే విడుదల చేయాలి

బయ్యారం: అఖిలపక్ష పార్టీల నాయకులను వెంటనే విడుదల చేయాలని భారాస నాయకులు డిమాండ్‌చేశారు. బయ్యారంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో బుధవారం వారు మాట్లాడుతూ సీఎంసీ స్థలం ముమ్మాటికి గ్రామానిదేనన్నారు.

మాజీ సర్పంచి రిమాండ్

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని ఇస్లావత్ తండా మాజీ ఉప సర్పంచి ఫోర్జరీ సంతకం చేసిన కేసులో మాజీ సర్పంచి ఇస్లావత్ నరేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కురవి ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఇస్లావత్ తండా నరేష్ సర్పంచిగా ఉన్న సమయంలో ఉపసర్పంచి సంతకం ఫోర్జరీ చేసి బ్యాంకు నుంచి రూ. 49వేలు విడిపించుకున్న విషయంలో అప్పటి ఎంపీవో హరిప్రసాద్ విచారణ చేసి కురవి ఠాణాలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఉప సర్పంచి సంతకం ఫోర్జరీ చేసిన విషయం వాస్తవమేనని ల్యాబ్ నివేదిక రాగా నరేష్‌ను అరెస్టు చేసి జుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



సత్యనారాయణ(పాత చిత్రం)

తొర్రూరు, న్యూస్‌టుడే: దంపతుల మధ్య గొడవలతో మనస్తాపానికి గురైన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మాటేడులో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎనమనగండ్ల సత్యనారాయణ(38) శుభకార్యాలకు డెకరేషన్, టెంట్లు వేస్తూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై తల్లి, భార్యతో తరచూ గొడవలు పడేవాడు. ఈ క్రమంలో బుధవారం గొడవ జరగడంతో మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భార్య యామిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య సిబ్బందికి వైద్య పరీక్షలు



మహబూబాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలో బుధవారం 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వైద్య శిబిరం నిర్వహించి పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. పురపాలక సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కమిషనర్ నోముల రవీందర్, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్లు ఎడ్ల వేణు, పోతురాజు రాజు, జగన్, వైద్యులు పాల్గొన్నారు.

నేడు ప్రదర్శన



మానుకోట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించే 'పెన్షన్ ఆక్రోష్' ప్రదర్శనను ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్స్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి కోరారు. స్థానిక కంకరబోడ్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో బుధవారం ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ స్కీం విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడ్ని సన్మానించిన మాజీ ఎంపీ



మహబూబాబాద్, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిని ఆర్ఎస్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత జీవీఎస్.శ్రీనివాసాచారి ఉన్నారు.

భాజపా హయాంలోనే అభివృద్ధి

గూడూరు, న్యూస్‌టుడే: అత్యధిక సభ్యత్వ నమోదు చేసి జిల్లాలో గూడూరు ఆదర్శంగా నిలవాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. మండలంలోని బొద్దుగొండ గ్రామంలో 107వ బూత్ పరిధిలో బుధవారం సభ్యత్వాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భాజపా హయాంలోనే పల్లెలు అభివృద్ధి సాధించాయన్నారు. జిల్లా నాయకులు చెవిటి ఐలయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమశాఖలో పదోన్నతులు కల్పించాలి

గార్ల, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖలో కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో పోస్టులను మంజూరు చేయాలని, వ్యాయామ, భాషా పండితుల పోస్టులకు పదోన్నతులు కల్పించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీరూనాయక్ ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. స్థానిక ఆశ్రమ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన, విధుల్లో చేరిన ఉపాధ్యాయులను సత్కరించారు. టీపీటీఎఫ్, టీఎస్‌యూటీఎఫ్, టీడబ్ల్యూటీయూ, ఏటీఎఫ్, పీఆర్‌టీయూ, టీఎస్‌టీటీఎఫ్ నాయకులున్నారు.

సీఎంసీ పరిరక్షణ కమిటీ సభ్యులను కలిసిన మాజీ ఎమ్మెల్యే

గార్ల, న్యూస్‌టుడే: స్థానిక రక్షకభట నిలయంలో పోలీసుల అదుపులో ఉన్న బయ్యారం సీఎంసీ పరిరక్షణ కమిటీసభ్యులను బుధవారం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ హరిసింగ్‌నాయక్ కలిసి వివరాలు తెలుసుకున్నారు. పోరాటానికి సంఘీభావం తెలిపారు. పోలీసుల అదుపులో కాంగ్రెస్, భారాస, సీపీఐ, న్యూడెమోక్రసీ తదితర పార్టీలకు చెందిన 13 మంది నాయకులను స్థానిక ఠాణాలో ఉంచారు. జిల్లా ఎస్పీ ఎదుట హాజరు పరచేందుకు గార్ల, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సైలు తిరుపతి, జీనత్‌కుమార్ నాయకులను తీసుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే వెంట భారాస మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, రాధాకృష్ణ, గణేష్, కొండల్‌రావు తదితరులున్నారు.



పరిరక్షణ కమిటీ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

రుణమాఫీ చేయాలని వినతి

కురవి: రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం బలపాల ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు కిషన్‌నాయక్, రామకృష్ణ, హరిలాల్, స్వామి, వెంకన్న ఉన్నారు.

తండ్రి మృతదేహాన్ని గుర్తించిన కుమార్తె

కైకలూరు, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా కైకలూరు మండలం వింజరం పంట కాలువలో ఈనెల 21న గుర్తుతెలియని మృతదేహం కనిపించడంతో పట్టణ పోలీసులు కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు దిన పత్రికల్లో వార్తలను చూసిన తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన మృతుడి కుమార్తె జ్యోతిర్మయి పోలీసులను ఆశ్రయించారు. మృతదేహాన్ని చూసి తన తండ్రి నక్కిన నాగభూషణం(47)గా గుర్తించినట్లు సీఐ పి.కృష్ణ తెలిపారు. ఈనెల ఒకటో తేదీన నాగభూషణం తెలంగాణ రాష్ట్రంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వరదలు వచ్చిన సమయంలో స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మహబూబాబాద్‌లోని రాళ్లవాగు దాటుతుండగా.. నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో రాళ్ల వాగు నుంచి మున్నేరు వాగు, కృష్ణానది మీదుగా వింజరం లాకుల వద్దకు మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడి కుమార్తె ఇచ్చిన ఆధారాలను సేకరించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

నోటీసులను ఉపసంహరించుకోవాలని ధర్నా

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రెండు, మూడు దశాబ్దాలకు పూర్వమే నిర్మించుకొన్న పేదల ఇళ్లకు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు అంటూ నిరుపేదలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, జీవో 58లో కూడా అనేక మందికి పట్టాలు జారీ అయ్యాయన్నారు. ఇటీవల పురపాలక అధికారులు మీ వద్ద ఉన్న ఆధారాలు ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోని పేదలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రం అందించారు. సీపీఎం నాయకులు సమ్మెట రాజమౌళి, కుంట ఉపేందర్, చీపిరి యాకయ్య, కె.నాగన్న, శాగంటి భాగ్యమ్మ, మచ్చ వెంకన్న, జి.భిక్షపతి పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు